క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మంగపేట: మండలంలోని కమలాపురం గోదావరి ఒడ్డు ప్రాంతానికి చెందిన పల్లె వేణు (మేస్త్రీ) ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందచేశారు. కుటుంబానికి ఎలాంటి ఆపదవచ్చినా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీష్, మండల నాయకులు సంపత్, శ్యామ్‌లాల్, జగదీష్, అశోక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



వెంకటాపురం(కె) : ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తహసీల్దార్ నెల్లుట్ల సృజన్‌కుమార్ అన్నారు. స్థానిక దుర్గమ్మ గుడి సెంటర్‌లోని ఆలయం ప్రాంగణంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన నిర్వహించిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శిబిరంలో మండల ఫొటోగ్రాఫర్స్, స్థానికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెంకటాపురం, వాజేడు మండలాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిడెం సాంబశివరావు, చేయూత స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్, సాయి తేజ, విజయ్, జయరామ్, చంద్రకళ, శోభన్‌బాబు, సాంబశివరావు, రమేష్ , ప్రసాద్, మనోజ్ ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఏటూరునాగారం: సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల(ఏటూరునాగారం) మల్లంపల్లిలో నిర్వహించబడుతున్న కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో సీట్లను భర్తీ చేయడం కోసం దరఖాస్తులను స్వీకరించేందుకు ఈనెల 31లోపు సర్టిఫికెట్లతో వచ్చి అడ్మిషన్ పొందాలన్నారు. పూర్తి వివరాలకు 7995010599, 8985236003 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



వెంకటాపురం(కె) : ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ డైరీని సోమవారం తహసీల్దార్ నెల్లుట్ల సృజన్ కుమార్ తహసీల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇటీవల నూతనంగా మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను వెంకటాపురం, వాజేడు మండలాల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు చంద్రకళ, సాంబశివరావు, మనోజ్, వలుస రమేష్, రవి, ఆనంద్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలి



ములుగు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో ఏఎన్‌ఎంలు చేపడుతున్న సమ్మెకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా వైద్యసేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలను వదిలేసి నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుమల, నర్సమ్మ, సులోచన, భాగ్య, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కేటాయింపుపై సంబురాలు



ములుగు : సంబురాలు చేసుకుంటున్న నాయకులు

ములుగు: ములుగు జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతిని ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ములుగు జాతీయ రహదారిపై బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. గట్టమ్మ వద్దకు చేరుకున్న నాగజ్యోతి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సీనియర్ నాయకులు వేముల భిక్షపతి, సానికొమ్ము రమేశ్‌రెడ్డి, పీఆర్వో జంగిలి రవితేజతో పలువురు నాయకులు , కార్యకర్తలు మార్యదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపికైన జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి గెలుపుకు కృషి చేస్తామని పలువురు నాయకులు పేర్కొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాల్వపల్లికి చెందిన జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో మండలంలోని పార్టీ శ్రేణులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై టాపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దంగుల మల్లయ్య, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, జిల్లా సీనియన్ నాయకుడు పన్నింటి యాదిరెడ్డి, ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, నాయకులు వసంతరావు, చంద్రయ్య, తిరుపతి, సయ్యద్‌హుస్సేన్, రాంచందర్, సల్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

తెల్లం వెంకట్రావ్ అభిమానుల సంబరాలు



వెంకటాపురం(కె): సంబరాలు జరుపుకుంటున్న తెల్లం వెంకట్రావ్ అభిమానులు



నాగజ్యోతికి పూల మొక్క అందజేస్తున్న రవితేజ

వెంకటాపురం(కె): భద్రాచలం ఎమ్మెల్యే టికెట్‌ను కేసీఆర్ డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌కు కేటాయించడంపై ఆయన అభిమానులు మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం ఆర్అండ్‌బీఅతిథిగృహం సమీపంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో చింతల శ్రీను, సమ్మయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌కు రుణపడి ఉంటా



మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

ములుగు అసెంబ్లీ అభ్యర్థిగా తనను ప్రకటించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటానని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. జెడ్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో టికెట్ కేటాయించిన సీఎం కేసీఆర్ నమ్మకాన్ని వమ్ముచేయకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగిరేలా చూస్తానన్నారు. టికెట్ కేటాయింపులో సహకరించిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీని వా స్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల పార్టీ అధ్యక్షులు బాదం ప్రవీణ్‌కుమార్, రమణారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు విజయ్‌రాం నాయక్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎంపీటీసీ సమ్మయ్య, భిక్షపతి, రమేష్‌రెడ్డి, రమేష్, పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



దివ్యాంగులకు ఉపకరణాలను అందిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్, ఎంపీపీ

ములుగు: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ గంద్రకోట శ్రీదేవి సుధీర్ యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విద్యాశాఖ తరపున ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 104 మంది దివ్యాంగుల లబ్ధిదారులకు రూ.09.25 లక్షల విలువ చేసే పరికరాలను ఆమె, జిల్లా గ్రంధాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్‌తో కలిసి పంపిణీ చేశారు. వంట కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో వంట చేస్తున్న 107 మందికి తన సొంత ఖర్చులతో ఏకరూప చీరలను అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇక్బాల్, ఏఎంఓ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పోడు పత్రాలకు పహాణీలు ఇవ్వాలి



విలేకర్లతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

మంగపేట : ప్రభుత్వం గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఇటీవల నూతనంగా ఇచ్చిన భూముల హక్కు పత్రాలకు పహాణీలు ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి తదితర మండలాల్లో పోడు భూముల హక్కుపత్రాలు తీసుకున్న గిరిజనులు వ్యవసాయ రుణాలు పొందేందుకు పహాణీ నకల్లకోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళితే కొత్తపోడు హక్కుపత్రాలపై పహాణీ నకల్ ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెపుతున్నారన్నారు. దీంతో గిరిజన రైతులు బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు పొందలేక పోతున్నారన్నారు. విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి కొత్త హక్కుపత్రాలకు పహాణీలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే సమస్యపై ఐటీడీఏ పీఓ అంకిత్‌కు సోమవారం వినతిపత్రాన్ని ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు, జిల్లా నాయకులు చిరంజీవి, హన్మంతు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కుష్టు వ్యాధిపై సర్వే చేస్తున్న వైద్యులు



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఏటూరునాగారం: కుష్టు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యురాలు సుమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 5వ వార్డులో కుష్టువ్యాధి గుర్తింపు, ఫీవర్ సర్వేలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పలువురిని పరీక్షించి మచ్చలు ఉన్నట్లయితే నమూనాలను సేకరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, వర్షాకాలంలో వచ్చే వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించామన్నారు. ఆమె వెంట ఏఎన్‌ఎం గీత, హెల్త్ అసిస్టెంట్ జైలుబాబు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో వాడగూడెంలో సోమవారం ఇంటింటి ఫీవర్ సర్వే, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచొద్దన్నారు. జనావాసాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు బ్యాంకు ఉద్యోగుల సాయం



వంట పాత్రలు అందజేస్తున్న బ్యాంక్ అసోసియేషన్ సభ్యులు

ఏటూరునాగారం: ప్రకృతి ఉక్రోషానికి విలవిలలాడిన కొండాయి, మల్యాల, దొడ్ల వరద బాధితుల కు కెనరా బ్యాంక్ ఉద్యోగులు బాసటగా నిలిచారు. సోమవారం మండలంలోని కొండాయి వద్ద వరద బాధితులకు వరంగల్ కెనరాబ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లింగారెడ్డి ఆధ్వర్యంలో చీరెలు, లుంగీలు, టవల్స్, బెడ్ షీట్స్, వంట పాత్రలు, తదితర వస్తువులను అందజేశారు. అందజేసిన వారిలో రవి కెలోత్, విక్రమ్‌రాజ్, సాయిప్రసాద్, రమేష్, శ్రావణ్, త్రివేణి, వాసు, సుందర్, నవీన్, భార్గవ్, మేడారం పూజారి రమేష్ ఉన్నారు.

వసతి గృహాల్లో ఫాగింగ్



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 7వ వార్డులోని ఎస్టీ, ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఫాగింగ్‌ను చేపట్టినట్లు ఏటూరునాగారం బిల్ కలెక్టర్ రవీందర్ సోమవారం తెలిపారు. అంతేకాకుండా ఇంటింటికి ఫాగింగ్ చేపట్టామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల చుట్టూ నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. చెత్తాచెదారం ఉంటే ట్రాక్టర్‌లో వేయాలని కోరారు. ప్రజలు సహకరించి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యూత్ సభ్యులు



రమేష్‌కు నగదును అందజేస్తున్న యూత్ సభ్యులు

ఏటూరునాగారం: మండలంలోని రాయబంధం గొత్తికోయగూడెంలో ఇటీవల విషజ్వరం బారిన పడి సోడి అమృత మృతి చెందగా ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఏటూరునాగారం చైతన్య యువజన సంఘం సభ్యులు బాధితురాలి తండ్రి రమేష్‌కు సోమవారం మండల కేంద్రంలో రూ.16వేల నగదును అందజేశారు. అలాగే అమృత సోదరుడు సురేష్ కూడా జ్వరం రావడంతో వైద్య ఖర్చుల కోసం దోహదపడుతుందని అందజేసినట్లు చైతన్య యువజన సంఘం సభ్యుడు అజహర్ తెలిపారు. అందజేసిన వారిలో పిట్టల శ్రీనివాస్, కత్తెర శ్రీనివాస్, అలువాల శ్రీనివాస్, కాళ్ల రామకృష్ణ, సులేమాన్, ప్రశాంత్, రఘు ఉన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయుతోనే సాధ్యమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులకు త్వరలో చెల్లింపులు అవుతాయని, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేయడం ,317జీఓ బాధితుల సమస్యల పరిష్కారం, మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్, పాఠశాలల మౌళిక వసతుల కల్పన తదితర ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి పోలు నాగరాజు, గుండెల్లి రాజయ్య, సామల రమేష్, కృష్ణారెడ్డి, సదానందం, రవీందర్, సాంబయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, చంద్రయ్య, రాము పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధి



మాట్లాడుతున్న గోవా ఎమ్మెల్యే ప్రవస్‌యోజన

టేకుమట్ల(రేగొండ): డబుల్ ఇంజన్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధి సాధ్యమని గోవా బీజేపీ ఎమ్మెల్యే ప్రవస్‌యోజన అన్నారు. సోమవారం రేగొండలో భూపాలపల్లి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి అధ్యక్షతన శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు అనే పునాదిపై సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షతో ఏర్పడ్డ తెలంగాణ నేడు కుటుంబ పాలనలో చిక్కుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యుగదీశ్వర్, శిల్పారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగపూరి రాజమౌళిగౌడ్, వెన్నంపల్లి పాపన్న, రాంచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నిశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రసాద్‌రావు, తిరుపతిరావు, మనోహర్, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతి, సాయిలకు ప్రత్యేక చికిత్సలు



ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న అప్పయ్య

ఏటూరునాగారం: మండలంలోని రాయబంధం గొత్తికోయగూడెంలో జ్వరాలు ప్రబలుతున్నాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య తన సిబ్బందితో ఈనెల 17న వచ్చి ఇంటింటా సోదాలు చేసి జ్వర పీడితులను పరీక్షలు చేశారు. అందులో రాజు కుమార్తె శాంతి, కుమారుడు సాయిలకు మలేరియా జ్వరం పాజిటివ్ రావడంతో వారిని హుటాహుటిన ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. మూడు రోజుల ఉంచి ఇద్దరు పిల్లలకు రక్తశాతం ఐదు కంటే తక్కువగా ఉండడంతో తన అటెండర్ సురేందర్‌తో పిల్లలను శాంపిల్స్ పంపించి రక్తకణాలను ఎక్కించే విధంగా చర్యలు చేపట్టామని ఆయన వెల్లడించారు. వారి ఆరోగ్యం కుదట పడే వరకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని డీఎంహెచ్ఓ తెలిపారు.

'గృహలక్ష్మి'కి గిరిజనేతరులు అర్హులు కారా ?

- ప్రశ్నిస్తున్న గిరిజనేతర ప్రజలు
- పథకానికి అనుర్హులని జోరుగా సాగుతున్న ప్రచారం

మంగపేట: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి మండలంలోని గిరిజనేతరులు అర్హులు కాదా అన్ని మండలంలోని గిరిజనేతరులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలోని ములుగు అసెంబ్లీ నియోజకవర్గానికి 2,590 ఇళ్లు మంజూరయ్యాయని ఆగస్టు 10 వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈనెల 5న ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మండలంలోని 25 గ్రామ పరిధిలోని 3431 మంది గిరిజన, గిరిజనేతరులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో గ్రామకార్యదర్శులు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే నిర్వహించారు. పరిశీలించిన దరఖాస్తులను కార్యదర్శులు తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేసేందుకు అప్పగించాల్సి ఉంది. ఇదిలా ఉండగా మంగపేట మండలం ఏజెన్సీ పరిధిలోకి వస్తుందని ఏజెన్సీలో 1/70, ఎల్‌టీఆర్ (బూబదలాయింపు నిషే ధ చట్టం), పెసా వంటి చట్టాలు అమలులోకి వ స్తాయని దీంతో మొదటి ప్రాధాన్యత స్థానిక గిరిజనులకే ఉంటుందన్నారు. మండలానికి మంజూరైన ఇళ్లు అర్హులైన ఎస్టీలకు కేటాయించిన తర్వాత మిగిలితే వాటిని మాత్రమే 1970 సంవత్సరానికి ముందు నుంచి స్థానికంగా నివసించే గిరిజనేతరులకు మంజూరీ చేస్తారని గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి గిరిజనేతరుల చేసుకున్న గృహలక్ష్మి దరఖాస్తులపై స్పష్టమైన సమాచారం వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని మొత్తం 25 గ్రామ పంచాయతీల పరిధిలోని 23 రెవెన్యూ గ్రామాలు ఏజెన్సీ పరిధి లోకి వస్తాయని ఆయా గ్రామాల్లోని గిరిజనులకు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన, 1/70, 1959 ఎల్టీర్(భూబదలాయింపు), అటవీహక్కుల చట్టం, కోఆపరేటివ్ సమాకార సంఘం ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వహక్కులు గిరిజనులకు వర్తిస్తాయని హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిని పరిగణలోకి తీసుకుని ఏజెన్సీ ప్రాంతంలో రాజ్యాంగంలో పొందపరిచిన గిరిజన చట్టాల నిబంధనల మేరకు గిరి జనేతరులకు గృహలక్ష్మి పథకానికి అనర్హులని ప్రచారం జరుగుతోంది. జిల్లా అధికారులు ఎంపికలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే వరకు వేచి చూడాల్సిందే.

ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యం

భూపాలపల్లిరూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ధర్మ సమాజ్ పార్టీ ముందుకెళ్తుందని జిల్లా ధర్మసమాజ్ ప్రచార కమిటీ సభ్యులు కొత్తూరి రవీందర్ అన్నారు. సోమవారం పార్టీ పిలుపు మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభించినట్లు రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అయినప్పటికీ 93 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజల తలరాతలు మారలేదన్నారు. భారత రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులను పేదలకు అందించడం కోసం ధర్మ సమాజ్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. పాదయాత్రలో ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మ సమాజ పార్టీ ఇన్‌చార్జ్ సుమన్, నాయకులు రవీందర్, శ్రీనివాస్, మహర్షి, హరీష్, నరసింహ, అశోక్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి వేడుకలు



కోటగుళ్లలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

గణపురం : నాగుల పంచమి సహిత శ్రావణ మొదటి సోమవారం కావడంతో మండలంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివాలయాలకు భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్ళు, బుద్ధారం గ్రామంలోని పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం, చెల్పూరులోని సాంబశివ ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి, నాగమయ్యకు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితకరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని పిడిసిల్ల శివారు ఎల్లారెడ్డిపల్లె గ్రామంలోని నాగదేవత దేవాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో కంపెనీ సిబ్బంది

చిట్యాల: నిరుపేద రైతు కుటుంబాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు బయోస్టార్ కంపెనీ నుంచి చిట్యాల డిస్ట్రిబ్యూటర్ పువ్వాటి హరికృష్ణ , కంపెనీ మేనేజర్ పిట్ట లక్ష్మన్ ఆధ్వర్యంలో సోమవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ. 2500 చొప్పున పది మందికి అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాకేష్, పూర్ణ చందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.